క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ఉరవకొండ: వజ్రకరూరు మండలంలోని కొన కొండ్లలో ఉన్న ఎమ్మెల్సీ స్వగృహంలో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి గురువారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ చేశారు. ఉరవకొండ మండలంలోని షేక్షానుపల్లి గ్రామానికి చెందిన మాదిగ రేణుకమ్మ కొంత కాలంగా అనారోగ్యంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంది. దీంతో ఆమె వైద్య బిల్లులు ఎమ్మెల్సీకి అందించి సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకుంది. బాధితురాలికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ1.16 లక్షల చెక్కును ఎమ్మెల్సీ అందించారు.

నేడు మున్సిపల్ సమావేశం

రాయదుర్గంటౌన్: పురపాలకసంఘంలోని కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. పట్టణంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలతోపాటు ప్రజా సమస్యలపై చర్చిస్తామన్నారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు, విభాగాల వారిగా అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

సర్మస్ హుసేన్సీ దర్గాలో ఫాతేహాలు



అలంకరణలో స్వామి సమాధి

బొమ్మనహాళ్: మండలంలోని దర్గాహొన్నూరు సర్మస్ హుసేన్సీ స్వామి దర్గాలో గురువారం భక్తులు ప్రత్యేక ఫాతేహాలు సమర్పించారు. స్వామి దర్శనార్థం ఆంధ్రా, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దర్గా పెద్దలు ఉదయం స్వామి సమాధికి గంధం పూసి నూతన వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక ఫాతేహాలు, ప్రార్థనలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గా ఆవరణలో కందూరీలు చేశారు.

ఇంటి స్థలం ఆక్రమించారంటూ ఫిర్యాదు

బెళుగుప్ప: ప్రభుత్వం మంజూరు చేసిన రెండు సెంట్ల ఇంటి స్థలాన్ని రాత్రికి రాత్రే సురేష్‌నాయక్ అనే వ్యక్తి ఆక్రమించి రాతిబండలు పాతి టార్పాలిన్ వేసుకున్నాడని గురువారం మండలంలోని బెళుగుప్ప తండాకు చెందిన బాలక్కబాయి పోలీసులకు ఫిర్యాదు చేసింది. న్యాయం చేయాలని ఆమె పోలీసులను కోరింది.

మామిడి చెట్లకు నిప్పు

కుందుర్పి: మండలంలోని శీగలపల్లి గ్రామానికి చెందిన రైతు రుక్మిణమ్మకు చెందిన రెండు ఎకరాల్లో మామిడి చెట్లకు గురువారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. సుమారు రూ.1.50 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయింది. ఈ మేరకు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మొక్కజొన్న పంటకు..

విడపనకల్లు: మండలంలోని వేల్పుమడుగులో రైతు నాగరాజురెడ్డికి చెందిన మొక్కజొన్న పంటకు నిప్పంటుకుని గురువారం కాలిపోయింది. ఆయన మూడెకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశాడు. రెండు రోజుల్లో పంటను కోత కోయాలనుకుంటున్న సమయంలో గుర్తు తెలియన వ్యక్తులు నిప్పు పెట్టారని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. పంటంతా కాలిపోయి మూడు లక్షల వరకూ నష్టం వచ్చినట్లు ఆయన వాపోయాడు. ఉరవకొండ అగ్ని మాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు.

జంబుకేశ్వరస్వామి ఉత్సవాలు ప్రారంభం



అలంకరణలో జంబుకేశ్వరస్వామి

రాయదుర్గంటౌన్: పట్టణంలో కోటలో వెలసిన స్వయంభూ జంబుకేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. స్వామి బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 9వ తేదీ వరకు జరుగుతాయని గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి నరసింహారెడ్డి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు గురువారం ఆలయంలో అంకుర్పారణ, కలశ స్థాపన, రాత్రి రక్షాబంధనము, మహామంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం ధ్వజారోహణ, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠ, సాయంత్రం సూర్యప్రభ వాహనోత్సవం ఉంటుందని ఈఓ తెలిపారు.

రమణీయం.. రాములోరి కల్యాణం

- ఊరూరా శ్రీరామనవమి వేడుకలు
- ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు
- పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించిన విప్ కాపు రామచంద్రారెడ్డి



కణేకల్లు: శ్రీరాముని శోభాయాత్రలో ట్రాక్టర్ డ్రైవింగ్ చేస్తున్న ప్రభుత్వ విప్ కాపు

రాయదుర్గం/కళ్యాణదుర్గం/ఉరవకొండ సాక్షిబృందం: సమస్త మంగళ వాయిద్యాల మధ్య, ముల్లోకాలు మురిసే విధంగా మూడుముళ్ల బంధంతో శ్రీరాముడు, సీతమ్మతల్లి ఒక్కటైన మధురక్షణాలు భక్తులను మంత్రముగ్ధుల్ని చేసింది. అభిజిత్ ముహూర్తాన సీతారాముల వారు ఒక్కటైన వేడుక అందరి మదిని ఆనందంలో ముంచెత్తింది. ఈ లోక కల్యాణం చూసిన కనులదే బాగ్యమైంది. ఆది దంపతులిద్దరిపై తలంబ్రాలు చల్లి పునీతులయ్యారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల వ్యాప్తంగా రామదేవాలయాలతో పాటు హనుమ క్షేత్రాల్లో గురువారం శ్రీరామనవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. రాయదుర్గం పట్టణంలోని కొండమీద వెలసిన సీతారామస్వామి ఆలయంలో కల్యాణ వేడుకలు అత్యంత శోభాయమానంగా జరిగాయి. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. సుమారు పది వేల మందికి అన్నదానం చేపట్టారు. వేడుకల్లో మున్సిపల్ చైర్మెన్ పొరాళ్ల శిల్ప, వైఎస్సార్‌సీపీ నాయకుడు పొరాళ్ల శివ, తహసీల్దార్ మారుతి పాల్గొన్నారు. అలాగే బళ్లారి రోడ్డు లో వెలసిన రామదేవాలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మురడి ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన వేడుకల్లో ఈఓ నరసింహారెడ్డి, చైర్మన్ పద్మనాభరెడ్డి పాల్గొన్నారు. చిన్నారుల కోలాటం, చెక్కభజన ప్రదర్శన ఆకట్టుకుంది.

పట్టువస్త్రాలు సమర్పించిన విప్ కాపు..

నియోజకవర్గంలోని ప్రసిద్ధి చెందిన పలు పుణ్యక్షేత్రాలను ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి సందర్శించారు. పలు ఆలయాల్లో స్వయాన సీతా, రాములకు పట్టువస్త్రాలు సమర్పించి కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. సీతా, రాములు ప్రజలందరిని చల్లగా చూడాలని, ఈ ఏడాది మంచి వర్షాలు కురిసి రైతుల ఇంట సిరుల పంట పండేలా చూడాలని మొక్కుకున్నారు. రేకులకుంట, హనకనహాళ్, మురడి తదితర ఆలయాల్లో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ప్రత్యేక పూజలు చేయించారు. రాయదుర్గం మండలం రేకులకుంట గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కళ్యాణం నిర్వహించారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీపీ విద్యావతి, జంగమ కార్పొరేషన్ డైరెక్టర్ పుష్పావతి , బోర్‌వెల్ నాగిరెడ్డి, సర్పంచ్ ఎర్రిస్వామిరెడ్డి, శివారెడ్డి , సీతారామిరెడ్డి, రాయంపల్లి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

- బొమ్మనహాళ్ మండలంలోని నేమకల్లు ఆంజనేయ స్వామి ఆలయంతో ఉద్దేహాళ్, శ్రీరంగాపురం క్యాంప్, కురువల్లి, ఎల్‌బీనగర్ గ్రామాల్లో సీతారాముల కల్యాణం కనుల పండువగా సాగింది. కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.
- కణేకల్లులోని రామాలయంలోతోపాటు పలు ఆంజనేయస్వామి ఆలయాలు, ప్రసిద్ధి గాంచిన నాగేపల్లి, పెనకలపాడు ఆంజినేయస్వామి ఆలయాల్లో సీతారాముల కల్యాణం నిర్వహించారు. పెనకలపాడు గ్రామంలో సీతారాముల కల్యాణ వేడుకల్లో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. సాయంత్రం కణేకల్లులోని రామనగర్, నాగేపల్లిలో సీతారాములను సర్వాంగ సుందరంగా అలంకరించిన రథంలో ఉంచి ఊరేగించారు. నాగేపల్లిలో విప్ కాపు రథోత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ సభ్యుడు సభ్యులు పాటిల్ నాగిరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ యంద్రకాయల వన్నూరప్ప, పెనకలపాడు సర్పంచు రామాంజినేయులు, వైస్ సర్పంచు అనిల్‌కుమార్, కణేకల్లు మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, పట్టణ కన్వీనర్ టి.కేశవరెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు మారెంపల్లి మారెన్న, మండల జేసీఎ కన్వీనర్ హనుమంతరావు, నాగేపల్లి ఎంపీటీసీ జయరాం, సర్పంచు ఫణీంద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కణేకల్లు శ్రీరాముని శోభయాత్ర అంగరంగవైభవంగా జరిగింది. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి శ్రీరామున్ని దర్శించుకొని పూజలు నిర్వహించి ట్రాక్టర్ ఎక్కి శోభయాత్రను ప్రారంభించి దిగువవీధి వరకు నడిపారు.
- గుమ్మఘట్ట మండలంలోని గొల్లపల్లి, 75వీరాపురం తాండా,భూపసముద్రం,దేవరెడ్డిపల్లి గ్రామాల్లో సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. దేవరెడ్డిపల్లిలో సీతారాములను రథంలో ఊరేగించారు.గోనబావిలో సీతారాముల చిత్రపటాన్ని ఊరేగించారు.కలుగోడులో ఆంజినేయస్వామి దేవాలయంలో భజన కార్యక్రమం నిర్వహించారు.
- కళ్యాణదుర్గం పట్టణంలోని పట్టాభిరామ స్వామి ఆలయంతో పాటు సాయిబాబా ఆలయం, దురదకుంటలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. 12.30 గంటలకు మహా మంగళ హారతి నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.
- బ్రహ్మసముద్రం మండలంలోని వేపులపర్తిలో లక్ష్మీ రంగనాథ స్వామి కళ్యాణం కమనీయంగా సాగింది వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బసవరాజు, ఖాద్రీ, విలేజ్ ఇండస్ట్రీస్ రాష్ట్ర డైరెక్టర్ కేపీ కమలాక్షి దంపతులు,ఆలయ కమిటి చైర్మన్ ఈశ్వర్, ఎంపీటీసీ బూసప్ప, సర్పంచ్ రంగప్ప తదితరులు పాల్గొన్నారు.
- శెట్టూరు మండల పరిధిలోని కనుకూరులో రామలింగేశ్వరస్వామి రథోత్సవం కనుల పండుగగా నిర్వహించారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.
- కుందుర్పి మండలంలోని వెంకటంపల్లిలో గురువారం రాత్రి శ్రీరామరథోత్సవ ఉత్సవాలు నేత్ర పర్వంగా సాగింది. సర్పంచ్ ప్రభాకర్, ఎంపీటీసీ సభ్యుడు అంజినరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.
- ఉరవకొండ పట్టణంలోని 4వ వార్డు సీతారామ ఆలయం, 14వ వార్డు చిన్న ఆంజినేయస్వామి, పార్కు ఆంజినేయస్వామి, కోదండరామస్వామి, ఇంద్రానగర్‌లోని ఆంజినేయస్వామి ఆలయాల్లో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సీతారాముల కళ్యాణోత్సవ వేడుకలు చేపట్టారు. మండలంలోని కొకుంట్ల రామాలయంలో కల్యాణోత్సం నిర్వహించారు. వేడుకల్లో సినిమా డైరెక్టర్ నాగేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అలాగే మండల వ్యాప్తంగా బూదగవి, లత్తవరం, ఆమిద్యాల, కొకుంట్ల వ్యాసాపురం తదితర గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలతో పాటు కల్యాణోత్సవం నిర్వహించారు.
- వజ్రకరూరు మండల కేంద్రంలోని బలిజవీధిలో ఉన్న శ్రీ సీతారాముల దేవాలయంలో కల్యాణోత్సవం నిర్వహించారు. అలాగే పందికుంట గ్రామంలో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవంలో ఎమ్మెల్సీ వై.శివ రామిరెడ్డి సతీమణి వై.ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు. ధర్మపురి, గూళ్యపాళ్యం, పీసీ.ప్యాపిలి, గడేహోతూరు, రాగులపాడులో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించారు. అలాగే వజ్రకరూరులో గురువారం రాత్రి సీతారాముల గ్రామోత్సవం చేపట్టారు. సాయంత్రం పందికుంటలో సీతారాముల స్వామి రథోత్సవం చేపట్టారు. రథోత్సవ కమిటీ నిరాహకులు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.మండల పరిధిలోని రాగులపాడు, గడేహోతురు, ధర్మపురి గ్రామాల్లో గురువారం సాయ త్రం సీతారాముల రథోత్సవం వైభవంగా నిర్వహించారు.
- కూడేరు మండల కేంద్రంలోని శ్రీకోదండరామ ఆలయంలో ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం ఘనంగా సాగింది. అలాగే కలగళ్ల, కరుట్లపల్లి, ముద్దలాపురం, కొర్రకోడులోని రామాలయాల్లో సీతారాముల కల్యాణం కనుల పండువగా సాగింది. కోదండరామ ట్రస్టు సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.
- విడపనకల్లు మండలంలోని పాలికి గ్రామంలో వేణుగోపాల స్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. అలాగే పాలికి,చీకలగురికి గ్రామాల్లో సీతారాముల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన పూల రథోత్సవంలో ఊరేగించారు.
- బెళుగుప్ప మండలంలోని నక్కలపల్లి, బెళుగుప్ప, ఆవులెన్న, తగ్గుపర్తి, గుండ్లపల్లి, రామసాగరం, నరసాపురం, దుద్దేకుంట, జీడిపల్లి, రమనేపల్లి, శీర్పి, వెంకటాద్రిపల్లి, హనిమరెడ్డిపల్లి తదితర గ్రామాల్లోని రామాలయాల్లో సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. బెళుగుప్ప, నక్కలపల్లి గ్రామాల్లో శ్రీరామనవమి శోబాయాత్ర చేపట్టారు.



వజ్రకరూరు: పందికుంటలో కల్యాణ వేడుకల్లో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సతీమణి వై.ఉమాదేవి



బొమ్మనహాళ్: నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం



గుమ్మఘట్ట: 75వీరాపురం తండాలో సీతారాముల కల్యాణాన్ని జరిపిస్తున్న పురోహితులు



కళ్యాణదుర్గం: ప్రత్యేక అలంకరణలో సీతారాములు



కళ్యాణదుర్గం: దురదకుంటలో శ్రీరాముని రథోత్సవానికి హాజరైన ప్రజలు



కణేకల్లు: నాగేపల్లి గ్రామంలో రథాన్ని లాగుతున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



శెట్టూరు:- కనుకూరులో రామలింగేశ్వరస్వామి రథోత్సవం దృశ్యం



ఉరవకొండ: గట్టువీధిలోని రాముల వారి ఆలయంలో కళ్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



రాయదుర్గం: సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



బెళుగుప్ప: నక్కలపల్లి సీతారాముల కల్యాణోత్సవం

దళితులపై దాడులకు పాల్పడితే సహించేది లేదు



మాట్లాడుతున్న దళిత, గిరిజన నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కళ్యాణదుర్గం: దళితులపై దాడులకు పాల్పడితే సహించేది లేదని దళిత, గిరిజన నాయకులు స్పష్టం చేశారు. స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో గురువారం నియోజకర్గ వ్యాప్తంగా వివిధ మండలాలకు చెందిన దళిత, గిరిజన నాయకులు, జెడ్పీటీసీ సభ్యుడు గుద్దెళ్ల నాగరాజు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ రామచంద్ర, సర్పంచు బాపూజీ, సచివాలయాల కన్వీనర్లు ఆంజనేయులు, గంగాధర్, అర్చన, జీవీఎస్ఎస్ నాయకుడు శివశంకర్‌నాయక్ విలేకరులతో మాట్లాడారు. శెట్టూరు మండలం లక్ష్మంపల్లిలో దళిత యువకుడు విరుపాక్షిపై ఉన్నం మారుతి, అతని అనుచరులు దాడి చేయడం సరైంది కాదన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. రైతులకు అన్యాయం జరుగుతుందని మాట్లాడే మారుతీ చౌదరికి టీడీపీ హయాంలో రైతులకు జరిగిన అన్యాయం గుర్తు రాలేదా అంటూ మండిపడ్డారు. రైతులతో ఎకరా రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు కొని, అవే భూములను గాలిమరల కంపెనీలకు ఎకరా రూ.10 నుంచి రూ.15 లక్షలకు అమ్ముకున్నప్పుడు రైతులు గుర్తు రాలేదా అంటూ నిలదీశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో రెయిన్‌గన్‌ల పేరిట డ్రిప్, స్ప్రింక్లర్ల పైపులు దోచుకున్నారన్నారు. రాజకీయ ఉనికి కోసం దళితులను కించపరుస్తూ దాడులకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కొల్లప్ప, గూబనపల్లి నాగరాజు, లక్ష్మంపల్లి వన్నూరుస్వామి, టైలర్ వన్నూరుస్వామి, సురేంద్ర, నాగరాజు, రామాంజినేయులు, రామకృష్ణ, సుధాకర్, తిప్పేస్వామి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీలపై దాడులు చేస్తే.. సహించేది లేదు

బ్రహ్మసముద్రం: టీడీపీ నాయకులు బీసీలపై దాడులు చేస్తే.. సహించేది లేదని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. గురువారం మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయం ఆవరణలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవరాజు, ఎంపీపీ కంభం చంద్రశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ ప్రభావతి , ఏడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ రామాంజనేయులు, వీరశైవ లింగాయత్ డైరెక్టర్ ప్రసాద్‌రెడ్డి, జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి అశోక్ రెడ్డి, పాలబండ్ల చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీటీసీ బూసప్ప, తిమ్మారెడ్డి విలేకరులతో మాట్లాడారు. నీచ రాజకీయాలు చేయడం ఉన్నం కుటుంబ సభ్యులకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ఉనికి కసం ఉన్నం కుటుంబ సభ్యులు రోజుకో డ్రామాకు తెరలేపుతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే కొడుకునని చెప్పుకుంటావే గానీ .. సొంతూర్లో కనీసం వార్డు మెంబర్ గా కూడా పోటీ చేసి గెలవని నీకు రాష్ట్ర మంత్రిని విమరించే స్థాయి కాదని గుర్తు చేశారు.

భద్రాద్రి రాముడిని దర్శించుకున్న మంత్రి



భద్రాచలం ఆలయ కమిటీ సభ్యులతో మంత్రి ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: శ్రీరామ నవమి పండుగ సందర్భంగా గురువారం భద్రాచలంలోని సీతారాములను రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని మంత్రి పూజలు చేపట్టారు. అనంతరం వేద పడింతులు మంత్రిని ఆశీర్వదించారు. ఆలయ అధికారులు మంత్రిని సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

నేడు మంత్రి పర్యటన

బ్రహ్మసముద్రం: మంత్రి ఉషశ్రీచరణ్ శుక్రవారం బ్రహ్మసముద్రం మండలంలో పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.పి బసవరాజు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం 4.00 గంటలకు వేపులపర్తి గ్రామంలో నిర్వహించనున్న లక్ష్మీ రంగనాథస్వామి రథోత్సవంలో మంత్రి పాల్గొంటారు. సాయంత్రం 4.30 గంటలకు గుండిగానిపల్లిలో సీతారాముల రథోత్సవానికి మంత్రి హాజరవుతారని ఆయన తెలిపారు. మండలంలోని పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

హోరాహోరీగా గిరిక బండి లాగుడు పోటీలు



ఉరవకొండ: బూదగవి గ్రామంలో గిరుకుబండి లాగుడు పోటీలు జరుగుతున్న దృశ్యం

ఉరవకొండ: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని గ్రామానికి చెందిన యువకులు హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం గిరిక బండ్ల లాగుడు పోటీలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా వందలాది ఎద్దుల బండ్లు పోటీ పడ్డాయి. మొదటి స్థానంలో బండారు చక్రవర్తి నిలవగా.. 17 తులాల వెండి, రెండో స్థానంలో నిలిచిన బోయ గిరికు 11 తులాల వెండి, మూడో స్థానంలో నిలిచిన ఆగలూరప్పకు 6 తులాల వెండి అందజేశారు.

విడపనకల్లు: మండలంలోని చీకలగురికిలో గురువారం శ్రీరామనవమి పురస్కరించుకుని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గిరిక బండి లాగుడు పోటీలు నిర్వహించారు. 10 జతల ఎద్దుల బండ్లు పోటీలో తలపడ్డాయి. ఇందులో సుంకప్ప అనే రైతుకు చెందిన ఎద్దులు ప్రథమ స్థానంలో, చిన్నారెడ్డి ఎద్దులు దితీయ స్థానంలో, గడిగే మల్లికార్జున ఎద్దులు తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి తనయుడు ప్రణయ్‌రెడ్డి సహకారంతో వరుసగా రు.6 వేలు, రూ3 వేలు, రూ.1500 వైఎస్సార్‌సీపీ నాయకులు మరిస్వామి,బొజ్జప్ప, చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో అశోక్, సురేష్, నరసింహులు, గోపాల్, చందు తదితరులు పాల్గొన్నారు.

'వైఎస్సార్ ఆసరా' సంబరాలు రేపు

కూడేరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శనివారం ఉదయం 10 గంటలకు 'వైఎస్సార్ ఆసరా' సంబరాల సభ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషా గురువారం తెలిపారు. పొదుపు సంఘాల మహిళలు, మండలంలోని ప్రజా ప్రతినిధులు హాజరు కావాలన్నారు.

ఘనంగా కనకదాస విగ్రహ ప్రతిష్ట

కుందుర్పి: మండల కేంద్రంలో గురువారం సాయంత్రం కురుబల ఆరాధ్య దైవం కనకదాస విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ఉదయం తప్పెట్లు, మేళతాళాల నడుమ కనకదాస విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. అనంతరం స్థానిక వైఎస్సార్ కూడలిలో కనకదాస విగ్రహాన్ని వందలాది మంది కురుబల సమక్షంలో ప్రతిష్ఠించారు. మండలంలోని కురుబలు రూ.2లక్షలు విరాళాలు సేకరించి విగ్రహ ప్రతిష్ఠకు సహకరించారు.

భంభంస్వామి జీవసమాధిని తాకిన సూర్య కిరణాలు



రాయదుర్గంటౌన్: పట్టణంలోని భంభంస్వామి దర్గాలో భంషేక్ అబ్దుల్‌స్వామి జీవసమాధిని సూర్య కిరణాలు తాకిన అద్భుత దృశ్యం సోమవారం ఉదయం 6.45 గంటల ప్రాంతంలో కనువిందు చేసింది. భక్తులు ఆ దృశ్యాన్ని తన్మయత్వానికి లోనయ్యారు.

'కాలవ'కు ప్రజల్లో ఆదరణ తగ్గింది

రాయదుర్గం: రాయదుర్గం ప్రజల పుణ్యాన మంత్రిగా అవకాశం దక్కినా ఒక్కటైనా మంచిపని చేయకపోవడంతో ప్రజల్లో కాలవ శ్రీనివాసులు పై క్రమంగా వ్యతిరేకత పెరిగిందని మార్కెట్ యార్డ్ చైర్మన్ వడిత్యా భోజరాజ్‌నాయక్ ఆరోపించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు.. కాలవ వ్యవహారశైలిపై విసుగు చెందిన ప్రజలు సార్వత్రిక ఎన్నికల్లో తగిన బుద్ధిచెప్పారన్నారు. అంతటితో ఆగకుండా అప్పటి నుంచి జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ టీడీపీని ఘోరంగా ఓడించాన్నారు. ఆ షాక్‌తోనే మతిభ్రమించిన కాలవ ఎదుటి వారిపై ఇష్టమొచ్చినట్టు మాట్లాడేస్థితికి చేరాడన్నారు. నీ ఐదేళ్ల హయాంలో సొంత ఖర్చులతో ప్రజలకు నీవెన్ని సేవా కార్యక్రమాలు చేశావ్..? మా నాయకుడు కాపు రామచంద్రారెడ్డి ఎన్ని చేశాడో చర్చకు రావాలని సవాల్ విసిరారు. ప్రజా సంక్షేమం కోసం సొంత ఖర్చులతో ఏడు వేల మందికి ఉచిత వివాహాలు, వికలాంగులకు ట్రై సైకిళ్లు, అక్క చెల్లెమ్మకు వడిబియ్యం, ఉచిత కంటి శిబిరాలు, అన్నదానాలు, ఆటల పోటీలు, దేవాలయాల అభివృద్ధికి విరాళాలు ఇచ్చిన ఘనత కాపు రామచంద్రారెడ్డిదన్నారు. అలాంటి వ్యక్తికి అవినీతి అంటగట్టాలని చూస్తే ప్రజలచే తిరుగుబాటు తప్పదన్నారు. రాజకీయ లబ్ధికోసం రాయదుర్గానికి కాలవ వలస వచ్చాడన్నారు. అసత్య ఆరోపణలు మానుకోకపోతే చూస్తు ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు.

నేటి నుంచి సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు



కూడేరు: దక్షిణ భారత దేశంలోని శివాలయాల్లో ఒక్కటిగా ప్రఖ్యాతిగాంచిన కూడేరులోని శివ పార్వతుల జోడు లింగాల సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమై ఏప్రిల్ 8 వరకు కొనసాగుతాయని ఈఓ బి.బాబు గురువారం తెలిపారు. 31న బండారు(బ్రాహ్మణ) వంశీకులు ఆధ్వర్యంలో శివ పార్వతులకు పుణ్యావాచనం, ఏప్రిల్ 1న రాత్రి 7 గంటలకు రెడ్డి సంఘం ఆధ్వర్యంలో శేష వాహనంపై శివ పార్వతుల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు ఉంటుందన్నారు. 2న ఈడిగ సంఘం ఆధ్వర్యంలో వ్యాఘ్ర వాహనంపై, 3న వైశ్య సంఘం ఆధ్వర్యంలో నెమలి వాహనంపై, 4న కమ్మ సంఘం ఆధ్వర్యంలో నంది వాహనంపై, 5న వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో ఐరావత వాహనంపై ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. 6న ఉదయం 9:45 నిమిషాలకు మడుగు తేరు, సాయంత్రం 6 గంగలకు రథోత్సవం, 7న కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో అశ్వ వాహనంపై ఊరేగింపు, పార్వేట ఉత్సవం, 8న పోనుగంటి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వసంతోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగిస్తాయని ఆయన తెలిపారు.